క్లుప్తంగా

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



ఆలయ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు: ఆధ్యాత్మికత అలవార్చుకునే వారికి మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండలంలోని మక్తగూడ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న బీరప్ప ఆలయ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయాలు హిందు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. దైవ చింతన కలిగిన వారు సాటి వారిపట్ల ప్రేమానురాగాలతో మెలుగుతారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ రాజు, నాయకులు ఎమ్మె సత్యనారాయణ, పద్మారావు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపుపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న చిన్నమంగళారం ప్రజలు

మొయినాబాద్: ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని చిన్నమంగళారం గ్రామస్తులు తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమిలో సర్పంచ్ కుమారుడు అక్రమంగా సుమారు 300 ట్రిప్పుల మట్టిని తరలించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్పంచ్ పదవిని అడ్డు పెట్టుకొని అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్రామస్తులు వెంకటేష్, ఆంజనేయులు గౌడ్, నర్సింగ్‌రావు, గోపాల్‌రెడ్డి, రాములు, మల్లేష్, శంకర్, అంజి తదితరులు ఉన్నారు.

పుస్తె, మెట్టెలు అందజేత



పుస్తె, మెట్టెలను అందజేస్తున్న సర్పంచ్ పద్మ

షాద్‌నగర్ రూరల్: మండలంలోని కంసాన్‌పల్లికి చెందిన యువతి శ్రీవాణి, యువకుడు శ్రీశైలం వివాహాలకు శుక్రవారం సర్పంచ్ బసిరెడ్డి పద్మ, మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్ రెడ్డి పుస్తె, మెట్టెలు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీరమ్మ, నర్సింలు, వెంకటయ్య, సత్యనారాయణ, సయ్యద్, జగదీష్, బాలవర్ధన్‌రెడ్డి, కావలి నర్సింలు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'తో పేదలకు మేలు



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ మహబూబ్ బీ

కొందుర్గు: కంటి వెలుగు కార్యక్రమం పేదలకు ఎంతో మేలని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మహబూబ్ బీ అన్నారు. చౌదరిగూడ మండలం ఇంద్రానగర్‌లో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పేదలు దృష్టి లోపంతో బాధపడరాదనే ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, అక్రం, శేఖర్, రాములు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశీలించి వసతులపై ఆరా తీశారు.

విరబూసిన టాబెబుయా



షాబాద్: మండలంలోని అంతారం స్టేజీ వద్ద ఓ వెంచర్ ఆవరణలో టాబెబుయా చెట్టు విరబూసింది. పసుపు రంగులో ఉన్న ఈ పువ్వులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఉష్ణ మండల ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించే ఈ చెట్టు మార్చి నెలలో పూస్తుందని గ్రామస్తులు తెలిపారు. వీటిని ట్రంపెట్ అని కూడా పిలుస్తారని, తేనెటీగలు, హమ్మింగ్ బర్డ్స్ ఆకర్షిస్తాయని చెప్పారు. రహదారికి ఇరువైపులా పూల తోటల్లో పెంచుకునేందుకు ఇవి అనువుగా ఉంటాయని వివరించారు. ఈ దృశ్యం శుక్రవారం 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

పేదల ఆశాజ్యోతి సావిత్రిబాయి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



షాద్‌నగర్‌లో సావిత్రిబాయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్: అణగారిన వర్గాల ఆశాజ్యోతి సావిత్రిబాయి పూలే అని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతిని శుక్రవారం షాద్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న ఆమె విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి సావిత్రిబాయిపూలే అన్నారు. భారతీయ సంఘ సంస్కర్తగా, ఉపాధ్యాయురాలిగా, రచయిత్రిగా ఆమె అన్ని రంగాల్లో రాణించారని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నయ్‌గావ్ గ్రామంలో జన్మించిన ఆమె 17ఏళ్ల వయస్సులోనే దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా ఎన్నికై మంచి ఖ్యాతిని సంపాదించిందన్నారు. అంటరాని కులాల బాలికల కోసం పాఠశాలను ప్రారంభించి, భర్తకు తోడుగా నిలిచారని తెలిపారు. ఆమె అడుగుజాడల్లో అందరు నడవాలన్నారు. కార్మికులకు, రైతులకు రాత్రి బడులను స్థాపించి చదువును నేర్పించారని అన్నారు. నేటి తరం విద్యార్థులు, మహిళలు సావిత్రిబాయి ఆశయాల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్, నాయకులు చింటు, జూపల్లి శంకర్, మామిడిపల్లి శరత్‌కృష్ణ పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో..

మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మహేష్ మాల సావిత్రిబాయి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, నర్సింహ్మా, మల్లేష్, శేఖర్, అశోక్, అంజి, రాజు, రమేష్, బాల్‌రాజ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్ల ఆవశ్యకతను వివరించండి



ఆరోగ్య సిబ్బందికి బహుమతులు అందజేస్తున్న డాక్టర్ స్రవంతి

షాద్‌నగర్: రెండేళ్లలోపు చిన్నారులందరికీ విధిగా వ్యాక్సిన్లు వేయించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని డాక్టర్ స్రవంతి ఆరోగ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ.. గ్రామాల్లోని గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే వారికి టీటీ ఇంజక్షన్లు, ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను గర్భిణులకు వివరించాలన్నారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి వెంటనే అద్దాలను పంపిణీ చేయాలన్నారు. గత ఫిబ్రవరి నెలలో బీమారం సబ్‌సెంటర్‌కు చెందిన ఆశ వర్కర్లు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతి చేయించి నందుకు వారికి బహుమతులను అందజేశారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్ వైజర్లు చంద్రకళ, శ్రీరామ, ఫార్మాసిస్టు ఉదయ్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా 'స్వయం పరిపాలన'





ఎక్లాస్‌ఖాన్‌పేట, దూసకల్ పాఠశాలల్లో నిర్వహించిన స్వయం పాలన దినోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

కేశంపేట/ షాద్‌నగర్ టౌన్: కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, షాద్‌నగర్ మండలం దూసకల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి వారికి పాఠాలు బోధించారు. చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో మనోహర్ ఉపాధ్యాయులు రామేశ్వరి, గిరిజా, అరుణకుమారి, సంధ్య, హెచ్ఎంలు సతీష్, రేవతి, ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, రామేశ్వరీ, వినయశీల, కరుణ శ్రీ, జ్యోతి, నీల్యా, సర్వరాజ్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో..

షాద్‌నగర్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(ఫరూఖ్‌నగర్), మండలంలోని వెలిజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకరయ్య, ఝాన్సీలక్ష్మి, శైలజ, ఎస్ఎంసీ చైర్మన్ కృష్ణయ్య పాల్గొన్నారు.



స్వయం పాలనలో పాల్గొన్న వెలిజర్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

హక్కులు సాధించుకోవాలి

- ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ టీనావతి
- ఘనంగా మహిళా దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మహిళా ప్రధానోపాధ్యాయులు

చేవెళ్ల: మహిళలు తలచుకుంటే ఏదైనా సాధ్యమేనని చేవెళ్ల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ టీనావతి అన్నారు. శుక్రవారం పాఠశాలలో వెల్‌స్పన్ ఫౌండేషన్, పద్మావతి మహిళా అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పలు పాఠశాలల మహిళా ఉపాధ్యాయులతో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో అనేక మార్పులు జరుగుతున్నాయని, మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు. మహిళలు వారివారి ప్రతిభ ఆధారంగా వివిధ రంగాల్లో రాణిస్తున్నట్లు చెప్పారు. మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళలపై పెరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు ఆగాలని, ఇందుకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. మహిళల్లో మరింత చైతన్యం రావాల్సి ఉందన్నారు. ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. మహిళా శక్తి ముందు ఏ శక్తి తట్టుకోలేదన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెల్‌స్పన్ ప్రాజెక్టు మేనేజర్ బీ భద్రయ్య, బీసీఐ మనేజన్ రవీంద్రనాథ్ రావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆర్ లక్ష్మి, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల హెచ్ఎం రజియా సుల్తానా, కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్వేతారెడ్డి, వెల్‌స్పన్ సీఎస్ఆర్ హెడ్ కే సురేఖ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారి కల్యాణానికి రండి

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డికి ఆహ్వానం



ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సర్పంచ్ రవీందర్‌గౌడ్

శంకర్‌పల్లి: మండలంలోని ఇంద్రారెడ్డి నగర్‌లో ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న పార్వతి పరమేశ్వరల కల్యాణ మహోత్సవం, అలాగే బీరప్ప జాతరకు రావాలని ఎమ్మెల్సీ పీ మహేందర్‌రెడ్డికి మిర్జాగూడ సర్పంచ్ రవీందర్‌గౌడ్ కోరారు. శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో కలసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కురుమ వెంకటేష్, గుడిమల్కాపురం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు ఒగ్గు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుడి (తెలుగు సబ్జెక్ట్ బోధనకు) పోస్టు భర్తీకి ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ జే మల్లయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 17వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు ఎంఏ తెలుగులో 55శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్ సెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. దరఖాస్తులను కళాశాలలో నేరుగా సమర్పించాలని సూచించారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9010593534ను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శంకర్‌పల్లి: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ ప్రదీప్ వర్మ శుక్రవారం తెలిపారు. చిన్న శంకర్‌పల్లి, శంకర్‌పల్లి రెల్వే స్టేషన్ పరిసరాల్లో, పత్తేపురం, మహాలింగపురం, లక్ష్మారెడ్డిగూడ, రావులపల్లి కలాన్, గాజులగూడ, చిన్నారెడ్డిగూడ, రామంతపురం, చందిప్ప, పర్వేద, ఏర్వగూడ, మాసానిగూడ, అంతప్పగూడ, సంకేపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

తండాల్లో రేషన్ షాపులు ఏర్పాటు చేయాలి



తహసీల్దార్ రహ్మాన్ ఖాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెంకట్‌రెడ్డి తదితరులు

నందిగామ: మండలంలోని తండాల్లో రేషన్ షాపులు ఏర్పాటు చేయాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు జిలెల్ల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వార్డు సభ్యులు శుక్రవారం తహసీల్దారు రహ్మాన్ ఖాన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నందిగామలో అనుబంధ గ్రామాలుగా ఉన్న పెద్దకుంట తండా, మధ్యకుంట తండా, బండకుంట తండాలు గ్రామ పంచాయతీకి 5 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయని తెలిపారు. ప్రతి నెలా రేషన్ సరుకులు కోసం 5కిలో మీటర్లు నడుచుకుంటూ నందిగామకు రావాల్సి ఉంటుందన్నారు. బైపాస్ రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ప్రతి తండాలో రేషన్ షాపు ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తొలగుతాయని తెలిపారు. వెంటనే ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.

నేషనల్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక



కార్తీక్



దేవ్ వర్ధన్



హన్సిక

శంకర్‌పల్లి: గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎస్ఎంఎంఎస్) పరీక్షల్లో మండలంలోని కొండకల్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మండలం నుంచి స్కాలర్ షిప్‌కి ఐదు మంది విద్యార్థులు ఎంపిక కాగా కొండకల్ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. కొండకల్ జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గొరిగె కార్తీక్, దేవ్ వర్ధన్, కోడి హన్సిక ఎంపికయ్యారు. మండలంలోని మహారాజ్‌పేట్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన వనజ, శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన భానుతేజ ఎంపికయ్యారు. విద్యార్థులు ఎంపిక కావడంతో పాఠశాల హెచ్ఎం విద్యాకర్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో మేధాశక్తి

షాబాద్: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుందని తిమ్మారెడ్డిగూడ సర్పంచ్ శకుంతల, పోతుగల్ హెచ్ఎం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ పాఠశాలలో యునైటెడ్ ఆఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ పోటీల్లో వెంకమ్మగూడ పాఠశాలకు ప్రథమ బహుమతి, తిమ్మారెడ్డిగూడ పాఠశాల, పోతుగల్ ఉన్నత పాఠశాలకు ద్వితీయ బహుమతులు వచ్చాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ పాఠశాలల విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌లో మంచి ప్రతిభ కనబరచడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పోతుగల్ పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, వెంకమ్మగూడ పాఠశాల హెచ్ఎం సింహాద్రి నాయుడు, ఫిజికల్ సైన్స్ టీచర్ సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్

షాద్‌నగర్: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని, అప్పుడే ఉన్నత శిఖరాలను చేరుకోగలుగుతారని హైదరాబాద్ ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ అన్నారు. శుక్రవారం షాద్‌నగర్‌లోని రైతు కాలనీలో గల ఉర్దూ మీడియం పాఠశాలలో కౌన్సిలర్ ఎండీ గౌస్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలకు సంబంధించిన మోడల్ పేపర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులో రాణించాలని సూచించారు. ఉర్దూ భాషాభివృద్ధికి రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ఆశించిన మేర కృషి చేయడం లేదన్నారు. ఎంఐఎం ఆధ్వర్యంలో ఉర్దూ మీడియం విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మైనార్టీ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. వార్షి పరీక్షల సమయం దగ్గర పడుతున్న తరుణంలో విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని, చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరీక్షలంటే భయాన్ని వీడాలన్నారు. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కన్న కలలను సాకారం చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు, ప్రజాప్రతినిధులు జాఫర్‌ఖాన్, నవాబ్ ఉద్దీన్, అహ్మద్, ఆసీఫ్ హుస్సేన్, సలీం, అబ్దుల్ రావూఫ్, వహీద్ హుస్సేన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వాల చిన్నచూపు

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

షాద్‌నగర్ రూరల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యారంగ వ్యతిరేక విధానాలతో ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 8 సంవత్సరాల పాలనలో ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నూతన నియామకాలు లేకపోవడంతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించలేక పోతున్నామని అన్నారు. ధనిక రాష్ట్రమని చెపుతున్న తెలంగాణలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఒకటో తేదీ వేతనాలు పొందలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ మున్సిపల్ ఎయిడెడ్, గురుకులాలు, మోడల్స్ స్కూల్‌గా వివిధ యాజమాన్యాల కింద పని చేస్తున్నాయని అన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు లేక నిరాశలో ఉన్నారని పేర్కొన్నారు. ఉన్నత ఆశయాలు ఉన్న వారిని మండలికి పంపితే మన సమస్యలపై పోరాడతారని అన్నారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, జిల్లా కార్యదర్శి నర్సింలు, మండల అధ్యక్షుడు కృష్ణయ్య, మండల కార్యదర్శులు యాదయ్య, వెంకటేశ్వర్లు గౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

మాణిక్‌రెడ్డిని గెలిపించుకుందాం

షాబాద్: ఉపాధ్యాయ గొంతుక పాపన్నగారి మాణిక్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించుకుందామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరంతోత్ గోపాల్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని సర్దార్ నగర్, తాళ్లపల్లి, మోడల్‌స్కూల్, రెసిడెన్షియల్ తదితర పాఠశాలల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 13న జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలల్లో సీరియల్ నెంబర్ 17 ఎదురుగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శివారెడ్డి, సీనియర్ నాయకులు ఈశ్వరయ్య, షాబాద్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలకృష్ణ, ప్రభాకర్, జిల్లా కమిటీ సభ్యులు సాధత అలీ, ఉపాధ్యాయ నేతలు తదితరులు పాల్గొన్నారు.



బూర్గుల ఉన్నత పాఠశాలలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జంగయ్య తదితరులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పండి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్



రేగడిదోస్వాడ ఉన్నత పాఠశాలలో ప్రచారం చేస్తున్న ప్రకాశ్, ప్రతాప్‌రెడ్డి

షాబాద్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డిని గెలిపించి బీఆర్ఎస్ ప్రభుత్వానికి టీచర్లు బుద్ధి చెప్పాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్లపల్లి, హైతాబాద్, రేగడిదోస్వాడ ఉన్నత పాఠశాలల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యావ్యవస్థను సీఎం కేసీఆర్ పట్టించుకోలేదని ఆరోపించారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు కేసీఆర్ ప్రయత్నాలు చేస్తారన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసి వేలాది పాఠశాలలు మూసివేశారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, రాష్ట్ర స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము, యువ మోర్చా జిల్లా కార్యదర్శి కూతురు మహేందర్ పాల్గొన్నారు.

ఏవీఎన్ రెడ్డిని గెలిపించండి

మొయినాబాద్ రూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తపస్ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డిని అత్యధిక మెజారిటీ గెలిపించాలని ఆల్ ఇండియా ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నక్కలపల్లి జంగారెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని కేతిరెడ్డిపల్లి, తోల్‌కట్ట, కనకమామిడి, ఆయా గ్రామాల్లో బీజేపీ నాయకులతో కలిసి ఏవీఎన్ రెడ్డి తరఫున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి అభ్యర్థిని ఎన్నుకుంటేనే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజ మల్లేష్, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజిరెడ్డి, వెంకటేష్, వీరారెడ్డి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించాలి

శంకర్‌పల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన ఏవీఎన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు బీ రాములుగౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు బీర్ల సురేష్ కోరారు. శుక్రవారం శంకర్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాల, బుల్కాపురం ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు తులసీరాం విజయ్‌కుమార్, ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు లక్ష్మీనివాస్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, లోకేష్, శ్రీనివాస్, కేశవ్, రాజశేఖర్, రాజ్‌కుమార్, ఆదర్శ పాఠశాల హెచ్ఎం ఉమామహేశ్వర్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు మాతోనే పరిష్కారం

చేవెళ్ల: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కావాలంటే బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి కోరారు. మండలంలోని చేవెళ్ల, కందవాడ, మల్కాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కుంచం శ్రీనివాస్, మండల నాయకుడు జీ వెంకట్‌రెడ్డి, కృష్ణగౌడ్, బీ శేఖర్‌రెడ్డి, భాస్కర్, మహేశ్వర్‌రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.